


జేఎస్ఎల్ లాకౌట్‌పై చర్చలు మళ్లీ వాయిదా

కొత్తవలస, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారంలో విధించిన లాకౌట్‌పై చర్చలు మంగళవారం మరోసారి వాయిదా పడ్డాయి. కర్మాగారానికి చెందిన టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు లెంకశ్రీను ఆధ్వర్యంలో కార్మికులు చర్చలకు హాజరయ్యారు. అంతలో జేసీఎల్‌కు అత్యవసర పని పడడంతో చర్చలను వాయిదా వేసిందని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారని శ్రీను తెలిపారు. చర్చలకు కర్మాగారానికి చెందిన మిగిలిన రెండు కార్మిక సంఘాలు హాజరు కాలేదన్నారు.

గాంధీపార్కు అభివృద్ధికి మరిన్ని నిధులు



అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్, పక్కన నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ అంబేడ్కర్

- సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ కృషి అభినందనీయం
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
- పార్కులో మరిన్ని సౌకర్యాలు: కమిషనర్ నల్లనయ్య

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్వర్క్, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): గాంధీపార్కు అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హామీ ఇచ్చారు. సమస్యలను గుర్తించడంతో పాటు పరిష్కారానికి ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో భాగంగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంయుక్తంగా మంగళవారం 43వ డివిజన్ పరిధిలోని గాంధీ పార్కులో సదస్సు ఏర్పాటు చేశాయి. జనవరి 8న కూడా ఇదే పార్కులో స్థానికంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సభ ఏర్పాటు చేశాయి. ఆ తర్వాత అధికారులు స్పందించి ఆ ప్రాంతీయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించారు. గాంధీ పార్కు అభివృద్ధికి కూడా చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మరోసారి స్థానికులతో చర్చించేందుకు అక్షరం అండగా పరిష్కారమే అజెండా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సదస్సు ఏర్పాటు చేశాయి. కార్యక్రమానికి కలెక్టర్ అంబేడ్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ పార్కు అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ రూ.35 లక్షల 85 వేలు కేటాయించిందని, పార్కు, పరిసర ప్రాంతాల చుట్టూ గ్రీనరీని అభివృద్ధి చేయాలని ఇందుకు నగరపాలక సంస్థ కొంత మొత్తాన్ని కేటాయించాలన్నారు. ప్రభుత్వం తరపున గాంధీ పార్కులో గ్రీనరీ అభివృద్ధికి మరిన్ని నిధులు విడుదల చేసేందుకు కృషి చేస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ, విజయనగరం అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో ముందుకు వెళ్తున్నామన్నారు. నగరంలోని పీఎస్ఆర్ పార్కునకు ఎకరా 60 సెంట్ల స్థలం ఉండగా, ఉడాకాలనీలో 70 సెంట్ల విస్తీర్ణంలో గాంధీ పార్కు ఉందన్నారు. పార్కులకు కలెక్టరు అంబేడ్కర్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, వీఎంఆర్‌డీఏ అధికారులు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమై పార్కులు (మిగతా 8వ పేజీలో..)

అవయవదానం.. మహాదానం

6లో

- ఒకరి త్యాగం.. ఎనిమిది మందికి ఆయువు
- నేడు జాతీయ అవయవదాన దినోత్సవం

● గత ఏడాది నవంబరు 14న పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన సాయికుమార్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బ్రెయిన్‌డెడ్ కావడంతో వైద్యులు కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. బాధలో ఉన్నా కూడా మరొకరి ప్రాణం నిలపవచ్చునని అవయవదానానికి అంగీకరించారు. వెంటనే ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి ఆయన అవయవాలను చెన్నైలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఓ వ్యక్తికి గుండెను అమర్చి ప్రాణం నిలిపారు.

● చీపురుపల్లి మండలం మెట్టపల్లి వాసులు మరణానంతరం తమ అవయవాలను దానం చేస్తామంటూ ప్రకటించారు. అవయవదానానికి ఒకేసారి ఎక్కువ మంది ముందుకొచ్చి అంగీకార పత్రాలు అందించారు. చీపురుపల్లి మానవీయత స్వచ్ఛంద సంస్థ ద్వారా గత ఏడాది నవంబరులో ఈ ఘటన జరిగింది. గరివిడి మండలం వెదుళ్లవలసలో కూడా ఒకేరోజు 120 మంది అవయవదానానికి అంగీకారం తెలిపారు.

ఈ విధంగా జిల్లాలో అవయవదానంపై అవగాహన పెరుగుతుండడం శుభ పరిణామం. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమవారి అవయవాలను దానం చేస్తుండడం అభినందించాల్సిన విషయం. అయితే ఇప్పటికీ కొందరిలో అపోహలు ఉన్నాయి. వాటిని నివృత్తి చేయడానికే ప్రభుత్వం ఏటా ఆగస్టు 13న అవయవదాన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.



డోలీ మోతలు తప్పేనా?



డోలీలో గర్భిణీని తరలిస్తున్న బంధువులు (ఫైల్)



చిధ్రమైన వేపాడ మండలం మారిక రోడ్డు

- ఏజెన్సీలో త్వరితగతిన రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం ఆదేశం
- గిరిజనుల్లో చిగురించిన ఆశలు
- పది నెలల క్రితం విడుదలైన పీఎం జన్‌మన్ నిధులు
- చిట్టింపాడు, గదబవలస రోడ్డుకు చేపట్టని భూమి పూజ
- ఇక మొదలవుతుందని నమ్మకం

గిరిజన గ్రామాల్లో అడవి తల్లి బాట పేరుతో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి. పీఎం జన్‌మన్ పథకంతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, ఉప ప్రణాళిక నిధులతో రహదారుల పనులు చేపడుతున్నాం. రెండు వారాలకోసారి ఈ రోడ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష జరిపి నివేదిక అందించాలి. అటవీ శాఖ నుంచి రావాల్సిన అనుమతులపై ఆశాఖ అధికారులతో సమీక్షిస్తాను. ఈ రోడ్లు పూర్తయితే గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సదుపాయం అందుబాటులోకి వస్తుంది. డోలీ రహిత గిరిజన ప్రాంతాల లక్ష్యం నెరవేరుతుంది.

- పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం ఏర్పాటుచేసిన టెలీకాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం

శృంగవరపుకోట ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని గిరిశిఖర గ్రామాల రోడ్ల నిర్మాణానికి నిధులు అందుబాటులో ఉన్నాయి. పనులు మాత్రం సకాలంలో పూర్తి కావడం లేదు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తాజాగా అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఆయన మాటలు గిరిపుత్రులకు ఊరట కలిగించాయి. రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు వారం వారం సమీక్షించడంతో పాటు నివేదికలు అందించాలని అధికారులకు ఆదేశించడంతో ఇకపై రోడ్లు పూర్తవుతాయని భావిస్తున్నారు. అదే జరిగితే డోలీ మోతల బాధ తప్పుతుందని ఆశపడుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. పదేళ్ల క్రితం ప్రారంభించిన పనులను కూడా పూర్తి చేయలేదు. ఇప్పటికీ రెండు అడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్న విధంగా రోడ్ల పరిస్థితి ఉంది. గిరిజన ఆవాసాల్లో రోడ్ల నిర్మాణానికి కనీస నిధులు కూడా కేటాయించలేదు. కొండ శిఖర ప్రాంతాల నుంచి కిందకు దిగాలంటే కాలినడక తప్పనిసరి కావడంతో అనారోగ్యం బారిన పడినవారు, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకువచ్చేందుకు డోలీ కట్టాల్సి వస్తోంది. నడిచి తీసుకువచ్చే క్రమంలో వైద్యం ఆలస్యం కావడంతో ఒక్కోసారి ప్రాణాల మీదకు వస్తోంది. సరైన రవాణా సదుపాయం లేక విద్య, విద్యం అందక సామాజికంగానూ వెనుకబాటు తనం అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిరిశిఖర గ్రామాల రోడ్ల అభివృద్ధిపై దృష్టిసారించింది. అధికారం చేపట్టిన మూడు నెలల వ్యవధిలోనే రాష్ట్ర వ్యాప్తంగా 130 గిరిజన (మిగతా 8వ పేజీలో..)





34వ డివిజన్‌కు ఉప ఎన్నిక

- ఓటర్ల జాబితాపై కసరత్తు
- త్వరలో నోటిఫికేషన్

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలోని 34వ డివిజన్‌కు త్వరలో ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికల ప్రక్రియను సెప్టెంబరు 17లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలిచ్చింది. 34వ డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు మృతి చెందడంతో ఖాళీ అయిన ఆ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఆన్‌లైన్ ద్వారా సమాచారం అందింది. అనంతరం కమిషనర్ నల్లనయ్య మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఆన్‌లైన్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలతోపాటు ఉప ఎన్నికలకు అవసరమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి ఫొటోలతో కూడిన ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. తప్పుల్లేకుండా చూడాలని, ఓటరు జాబితా ముద్రణ స్పష్టంగా ఉండాలని సూచించారు. ఉప ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఇచ్చినా తక్షణమే స్పందించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

దటీజ్ లెఫ్ట్ హ్యాండ్



- అరుదుగా ఉంటూ ప్రతిభ చాటుతూ
- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఎడమ చేతివాటమే
- నేడు లెఫ్ట్ హ్యాండర్స్ డే



ఎడమ చేతితో సంతకం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):

చాలామంది సహజంగా ఏ పని అయినా కుడిచేత్తోనే చేస్తారు. కానీ.. కొందరు మాత్రం ఎడమచేతిని వినియోగిస్తూ ప్రత్యేకంగా కనిపిస్తారు. వాస్తవానికి ఎడమ చేతివాటానికి చెందిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో రాణించారు. ఎడమచేతి రాతగాళ్లకు మెదడు చాలా స్పీడ్‌గా పనిచేస్తుందని, తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని పలు పరిశోధనల్లో కూడా తేలింది. క్రికెట్ క్రీడాకారుడు సచిన్ టెండూల్కర్, అమెరికా మాజీ అధ్యక్షులు బిల్‌క్లింటన్, ఒబామా ఎడమ చేతివాటం వారే. ఇలాంటి వారిలో చురుకుదనం, ఏకాగ్రత ఎక్కువగా ఉంటాయంటారు. బుధవారం 'లెఫ్ట్ హ్యాండర్స్ డే' సందర్భంగా ఎడమచేతి వాటానికి చెందిన కొంతమంది విజయ ప్రస్థానాన్ని తెలుసుకుందాం.

బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనది పుట్టుకతోనే ఎడమ చేతివాటం. అన్ని పనులూ ఆ చేతితోనే చేస్తుంటారు. భోజనం, రాయడం, ఆటలాడడం ఇలా అన్నీ ఎడమ చేయితోనే చేస్తున్నారు. ఆలయాలకు వెళ్లేటప్పుడు తీర్థప్రసాదాలను ఎడమ చేతితో స్వీకరించేటప్పుడు అర్చకులు అభ్యంతరం చెప్పేవారని, కుటుంబ సభ్యులు కలుగజేసుకొని అర్చకులకు నచ్చజెప్పేవారని ఆయన సరదాగా చెబుతుంటారు. శంకుస్థాపనలు, ఇతరత్రా పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు కొబ్బరికాయలు కొట్టడం, పూజలు నిర్వహించడం వంటివన్నీ అలవాటు ప్రకారం ఇప్పటికీ ఎడమ చేతితోనే చేస్తుంటారు.

మాస్టారును చూసి నేర్చుకున్నా

తామాడ కృష్ణమూర్తి, రిటైర్డ్ లెక్చరర్



నా చిన్నతనంలో శ్రీకాకుళం కస్పాస్కూలులో కామేశ్వరరావు అనే లెక్కలు మాస్టారు ఎడమ చేతితో రాసేవారు. ఏడో తరగతి చదువుతున్నప్పుడు అది చూసి తాను కూడా ప్రాక్టీసు చేశాను. రాయటమే కాకుండా ఫుట్‌బాల్, వాలీబాల్ (మిగతా 8వ పేజీలో..)

ఆల్బెండజోల్ మాత్రలను మింగాలి: కలెక్టర్

గంట్యాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నులి పురుగుల నివారణకు పిల్లలంతా తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని గంట్యాడ జడ్పీ పాఠశాలలో ఆయన మంగళవారం ప్రారంభించారు. పాఠశాల విద్యార్థుల చేత మాత్రలను మిగించారు. అనంతరం మాట్లాడుతూ కడుపులోని నులిపురుగులను నివారించేందుకు 19 ఏళ్ల లోపు పిల్లలంతా ఈ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని కోరారు. కడుపులో నులిపురుగులు ఉంటే పిల్లల్లో పోషకాహార లోపం ఏర్పడుతుందని, పెరుగుదల మందగించి బలహీనంగా తయారవుతారని చెప్పారు. నులిపురుగులను నిర్మూలించడానికి ఆల్బెండజోల్ మాత్రలను ఒక డోస్ కింద వాడాలని సూచించారు. తొలుత నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలు, నిర్మూలనా పద్ధతులపై షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శించారు. పాఠశాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా క్రషర్ డస్ట్ వేయాలని, శిథిలమైన భవనాలను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యం నాయుడు, జిల్లా వైద్యాధికారి జీవనరాణి, ఎగ్జామ్స్ కోర్డినేటర్ తిరుమలరాజు సన్యాసిరాజు, తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి మాత్రను మింగిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

అవయవదానం.. మహాదానం

నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

● ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బొబ్బిలి యువకుడికి కిడ్నీలు రెండు పాడయ్యాయి. అత్యవసరంగా ఒక కిడ్నీ అమర్చాల్సిన పరిస్థితి తలెత్తింది. అదే సమయంలో విజయనగరంలో మృతి చెందిన వ్యక్తి అవయవదానం చేయడంతో అతని కిడ్నీని బంధువుల అనుమతితో బొబ్బిలి తీసుకువచ్చి యువకునికి అమర్చారు. మరణించినప్పటికీ అవయవదానంతో మరో యువకుడికి విజయనగరం వాసి అయువు పోసినట్టయ్యింది.

● పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయికుమార్ రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయనకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించి తల్లిదండ్రులకు వైద్యులు తెలియజేశారు. వైద్యులు, అవయవదానంపై మృతుడి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి అంగీకారంతో గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి బ్రెయిన్‌డెడ్ అయిన సాయికుమార్ కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను పొరుగున వున్న విశాఖ జిల్లాకు తరలించారు.

● గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన గండి వెంకటరమణ, దేవి దంపతులు తన చిన్నకూతురు పల్లవి (13) కలిసి రోడ్డుమీద వెళ్తుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. పల్లవి బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించారు. పాప అవయవాలను దానం చేస్తే మరో నలుగురికి ఉపయోగపడి వారికి జీవితాన్ని ఇచ్చినట్టవుతుందని డాక్టర్లు చెప్పడంతో వారు అవయవదానానికి అంగీకరించారు. పల్లవి కిడ్నీలు, నేత్రాలు, అంబులెన్స్‌లో విశాఖలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు.





● 8 ఆర్గాన్లతో 8 మంది జీవితాలు నిలిపే అవకాశం ● ప్రజల్లో పెరగాల్సిన అవగాహన
● దాతల పార్థివ దేహాలకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

విజయనగరం రింగురోడ్డు/రాజాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి)

ఇలా వివిధ కారణాలతో చనిపోయిన వారు అవయవదానంతో మరో నలుగురికి ఆయువు పోశారు. ఇదే అవగాహన ప్రతి ఒక్కరిలో కలిగితే ఎంతో మందిని అర్ధాంతరంగా చనిపోకుండా కాపాడవచ్చు. అవయవదానంపై స్వచ్ఛంద సంస్థలు, ముఖ్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది మరింతగా అవగాహన కల్పించాల్సి ఉంది. చాలా మందికి అవయవాలు లభ్యంకాక జీవితమంతా జీవచ్ఛవాల్లా ఉండిపోతున్నారు. ఒకరి అవయవదానంతో ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చు. నేత్రాలు, కిడ్నీలు, ఊపిరితిత్తులు, గుండె, కాలేయం వంటివి ముఖ్యమైనవి. ఒక దాత ఎనిమిది మంది ప్రాణాలు రక్షించవచ్చునని వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అవయవాల వైఫల్యం కారణంగా ఏటా 5 లక్షల మంది మరణిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. మరణించిన వారి నుంచి నేత్రాలను సేకరించి అంధులకు అమర్చితే వారు చూపును పొందుతారు. మిగిలిన అవయవాలు మనిషి బతికుండగానే మార్పిడి చేయాల్సి వుంటుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వ్యక్తి తలకు బలమైన గాయాలైతే బ్రెయిన్‌డెడ్ కావొచ్చు. అటువంటి వ్యక్తి శరీరంలో అన్ని అవయవాలు యథావిధిగా పనిచేస్తాయి గాని వారు పూర్తిగా కోమాలో వుండిపోతారు. తిరిగి రికవరీ కావడం అసాధ్యం. అటువంటి పరిస్థితుల్లో ఆ వ్యక్తిలోని ప్రధాన అవయవాలు గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం, నేత్రాలను దానంచేస్తే వాటి వల్ల ఇతరులకు ప్రాణభిక్ష పెట్టిన వారవుతారు.

ఎన్ని గంటల్లో అమర్చాలంటే..

ఊపిరితిత్తులు, గుండెను ఆరు గంటల్లోపు, కిడ్నీలు 48 గంటల్లోపు, కళ్లను ఆరు గంటల్లోపు, కాలేయాన్ని 12 గంటల్లోపు వేరేవారికి అమర్చితే అవి యథావిధిగా పనిచేస్తాయి. ఏ ఆసుపత్రిలోనైనా బ్రెయిన్ డెడ్ అయి కోమాలో వున్న వారి అవయవాలను వారి కుటుంబ సభ్యులు దానంచేయాలంటే సంబంధిత ఆసుపత్రి నుంచి సమాచారం ఇవ్వాలి. అక్కడి నుంచి ప్రత్యేక వైద్య బృందం వచ్చి పరిశీలించి గంటల వ్యవధిలోనే కోమాలో వున్న వ్యక్తి అవ యవాలను గ్రీన్ ఛానల్ ద్వారా తరలిస్తారు. ముందుగా వారి వద్ద రిజిస్టర్ అయిన వారికి అమర్చుతారు.

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు..

అవయవదానంతో జీవదాతలుగా నిలిచిన వారి పార్థివ దేహాలకు గౌరవప్రదమైన వీడ్కోలు తెలపాలని, వారి అంతిమ యాత్రను రాష్ట్ర ప్రభుత్వం లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవయవదానం చేసిన కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించనున్నారు. కుటుంబ సభ్యులను గౌరవిస్తూ వారికి ప్రశంసాపత్రం, పుష్పగుచ్ఛాలతో ప్రభుత్వం సత్కరిస్తుంది. ప్రభుత్వ లాంచనాలతో నిర్వహించే అంతిమ సంస్కారాలకు కలెక్టరు లేదా జిల్లా స్థాయి సీనియర్ అధికారి వెళ్లాల్సి ఉంటుంది.

చట్టం చెబుతోంది..

1994లో తొలిసారిగా మనదేశంలో అవయవ, కణాల మార్పిడి చట్టాన్ని తీసుకొచ్చారు. 2011లో దానికి సవరణ చేశారు. అవయవాల సేకరణ, తరలింపు, కేటాయింపు వంటిని జాతీయస్థాయిలో జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్‌ఓటీటీఓ) పర్యవేక్షిస్తోంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జీవన్‌దాన్, ఇండియన్ రెడ్‌క్రాస్ వంటి సంస్థలు ఆ బాధ్యతలను చూస్తున్నాయి.

జీవనదాన్‌లో నమోదు చేసుకోవాలి..



అవయవదానం చేయాలనుకునేవారు ముందుగా వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తమకు తెలిసిన వారందరికీ సమాచారం ఇవ్వాలి. దీనివల్ల చనిపోయాక అవయవదానం చేసేందుకు వీలు కలుగుతుంది. జీవనదాన్ కార్యక్రమం 2014లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. విజయవాడ కేంద్రంగా కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి అవయవాలను సేకరిస్తారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ జీవనదాన్.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌లో డోనర్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్నవారికి ప్రభుత్వం ఆర్గాన్ డోనర్ కార్డు అందజేస్తుంది.

-డాక్టరు కె.రాంబాబు,
జీవనదాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టరు

అవయవదానంతో పునర్జన్మ..



పునర్జన్మ కేవలం అయవదానంతోటే సాధ్యం. మరణానంతరం కూడా మనం ఏదో ఒక రూపంలో ఎవరో ఒకరి దేహంలో జీవించే అవకాశం ఉంటుంది. చనిపోయిన తరువాత కూడా మన హృదయస్పందన వారి దేహంలో కొనసాగుతుంది. మన నేత్రాలతో వేరేవారు ప్రపంచాన్ని చూడవచ్చు. అందుకే యువత అపోహలు వీడి అవయవదానానికి ముందుకు రావాలి. అవయవదానంపై నేటికీ చాలా అపోహలు వున్నాయి. అవి ఏ మాత్రం వాస్తవం కాదు. మరణానంతరం శాశ్వతంగా జీవించే మార్గం అవయవదానమే.

-డాక్టరు జీవనరాణి, డీఎంహెచ్‌వో, విజయనగరం

అవగాహన తప్పనిసరి..



అవయవదానంపై జిల్లా వాసుల్లో ఇప్పటికీ చాలా అపోహలు ఉన్నాయి. దేశంలో ఏటా లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడి బ్రెయిన్ డెడ్‌కు గురి అవుతున్నారు. వీరిలో ఒక శాతం మంది మాత్రమే అవయవదానం చేస్తున్నారు. బ్రెయిన్ డెడ్ కేసుల నుంచి సేకరించిన కిడ్నీలు, గుండె, కళ్లను సంబంధిత వ్యాధిగ్రస్థులకు అమర్చగలిగితే అర్థాంతర మరణాలను ఆపవచ్చు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కూడా అవయవదానంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనాఉంది.

-డాక్టరు జేసీ నాయుడు, డాక్టరు ఎన్టీఆర్ యూహెచ్‌ఎస్ ఈసీ మెంబరు, విజయనగరం

స్వచ్ఛందంగా ముందుకు రావాలి..

అవయవదానంపై రెడ్‌క్రాస్ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ముందుకొచ్చే వారి నుంచి అంగీకర పత్రాలు తీసుకుంటోంది. సమాజంలో అవయవాలు సమకూరక లక్షల మంది ఇబ్బందిపడుతున్నారు. కానీ వేలల్లో కూడా అవయవ దాతలు లేకపోవడం విచారకరం. బ్రెయిన్‌డెడ్ రోగుల అవయవాలను ఇచ్చేందుకు కొందరు కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. వారు లేనిపోని అపోహలు పడుతున్నారు. అవగాహనతో ముందుకొస్తే చనిపోయి కూడా మరికొందరికి ప్రాణం పోయవచ్చు.

-పెంకి చైతన్యకుమార్,
రెడ్‌క్రాస్ ప్రతినిధి, రాజాం

గాంధీ పార్కుకు నిధులపై హర్షం

● ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలకు అభినందనల వెల్లువ

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



హర్‌ఘర్ తిరంగా సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ అంబేద్కర్, కమిషనర్ నల్లనయ్య



సదస్సుకు హాజరవుతున్న కలెక్టర్, కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'అక్షరమే అండగా, పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం ద్వారా ఉడాకాలనీలోని గాంధీపార్కులో సమస్యలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని నగరపాలక సంస్థ పరిష్కరించగా, పార్కు అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ నిధులు ఇచ్చింది. ఈ సందర్భంగా పార్కులో మంగళవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. గాంధీపార్కు అభివృద్ధి కమిటీ హర్షం వ్యక్తం చేసింది. స్థానికులు ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌కు అభినందనలు తెలిపారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన..

అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సు వద్ద వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఉడా కాలనీ వాసులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు, వృద్ధులు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి మందులు కూడా అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ అంబేద్కర్, నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, యూహెచ్‌ఎస్ ఈసీ మెంబరు డాక్టర్ జేసీ నాయుడు కూడా ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. ప్రజలకు అవసరమయ్యే ఇలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థను అభినందించారు.

చిన్న విషయం కాదు..



70సెంట్లు విస్తీర్ణం ఉన్న గాంధీ పార్కు అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉండేది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని జనవరి 8న నిర్వహించారు. ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, నగరపాలకసంస్థ కమిషనర్ నల్లనయ్యతో పాటు నగరపాలక సంస్థ అధికారులు వచ్చారు. సమస్యలన్నీ చెప్పాం. కొన్ని సమస్యలు అక్కడి కక్కడే పరిష్కరించారు. అంతటితో అయిపోయిందనుకున్నాం. గాంధీపార్కు అభివృద్ధికి నిధులు కేటాయించడం హర్షణీయం.

-జి.పురుషోత్తమరావు,
పార్కు కమిటీ ప్రతినిధి

నిధులు కేటాయించడం హర్షణీయం..



పార్కు అభివృద్ధికి వీఎంఆర్‌ఆర్‌డీఏ నిధులు కేటాయించడం హర్షణీయం. రూ.35.85 లక్షలు కేటాయించడం అనేది సాధారణ విషయం కాదు. ఇందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థలతో పాటు, కలెక్టరు అంబేడ్కర్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య కృషి అభినందనీయం. కాలనీ వాసులకు గాంధీ పార్కు అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి రావడం సంతోషదాయకం.

-పి.జనార్దనరావు, స్థానికుడు

పార్కు అభివృద్ధి ఊహించలేనిది..



గాంధీ పార్కు అభివృద్ధి ఊహించలేనిది, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం, తద్వారా పార్కులోని సమస్యలు వెలుగులోకి రావడం, ఆయా సమస్యలను పరిష్కరించడం చకచకా జరిగిపోయాయి. ఇది ఊహించలేని పరిణామం. గాంధీ పార్కు అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ నిధులు కేటాయించడం హర్షణీయం. దీంతో గాంధీపార్కు మరింత అభివృద్ధి చెందుతుంది.

-డి.పాపునాయుడు,
పార్కు అభివృద్ధి కమిటీ ప్రతినిధి

వేగంగా పనులు పూర్తి చేయాలి..



వీఎంఆర్‌డీఏ కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి. పార్కులో ఉన్న సమస్యలను ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు వెలుగులోకి తీసుకురావడం, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టరు, నగరపాలకసంస్థ కమిషనర్ తదితరులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ప్రశంసనీయం.

-జేబీఎస్ మూర్తి,
పార్కు అభివృద్ధికమిటీ సభ్యుడు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కమిషనర్



సదస్సుకు హాజరైన గాంధీ పార్కు ప్రాంతీయులు



ట్రాక్టర్లతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న గుమ్మిడి సంధ్యారాణి

రైతుల సంక్షేమమే ధ్యేయం

● మంత్రి సంధ్యారాణి
● ట్రాక్టర్లతో అన్నదాతా సుఖీభవ ర్యాలీలో భారీగా పాల్గొన్న రైతులు

సాలూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం సాలూరులో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో సంధ్యారాణి పాల్గొని స్వయంగా ట్రాక్టర్ నడిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బోసుబొమ్మ కూడలి మీదుగా ఎన్టీఆర్ విగ్రహం, అనంతరం కోట దుర్గ గుడి జంక్షన్ నుంచి పెద్ద కోమటిపేట, డబ్బివీధి మీదుగా సాలూరు ఏఎంసీ వరకు 200 ట్రాక్టర్లతో పెద్దసంఖ్యలో రైతులతో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థికసాయం అందించామన్నారు. కోత పూర్తయిన 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో పంట డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. వరదలు, వర్షాభావం, మార్కెట్‌లో గిట్టుబాటు ధర సమస్యలతో బాధపడుతున్న రైతులకు ప్రత్యేక ప్యాకేజీలు, పంట నష్టపరిహారం అందించామని చెప్పారు. పోలవరం, సుజల స్రవంతి వంటి సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నిమ్మాది తిరుపతిరావు, గుళ్ల వేణుగోపాలనాయుడు, గూడెపు యుగంధర్, ఆముదాల పరమేశు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

బెలగాం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పది విభాగాల్లో క్రీడా పోటీలు నిర్వహించినట్లు జిల్లా క్రీడా ప్రాధికారిత అధికారి కె.శ్రీధరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కళాశాల క్రీడా మైదానంలోఅథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్ బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహించి జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులను జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగే జోనల్ స్థాయి క్రీడా పోటీలకు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సంస్థ శిక్షకులు, ఎస్.జి.ఎఫ్ సెక్రటరీ మురళీ కృష్ణ, పీఈటీలు, పీడీలు తదితర స్పోర్ట్స్ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత లేని భోజనం ఎలా తినేది?

● పస్తులతో వసతిగృహం విద్యార్థుల నిరసన

శృంగవరపుకోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతి గృహంలో నాణ్యత లేని భోజనం పెడుతున్నారని.. తినలేకపోతున్నామని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం భోజనం తినకుండా నిరసన తెలిపారు. వసతిగృహ సంక్షేమ అధికారి సత్యనారాయణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు అన్నం, కూరలు పెట్టడం లేదన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం బాగోలేకపోయినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గదుల్లో లైట్లు, ఫ్యాన్లు కూడా ఉండడం లేదన్నారు. వీరికి ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, మహేష్, చైతన్య తదితరులు మద్దతుగా నిలిచారు.



తినకుండా నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రైతులకు అండగా ప్రభుత్వం

విజయనగరం రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం విజయనగరం మండల పరిధిలోని రాకోడు, దుప్పాడ, జొన్నవలస మీదుగా రైతులు నిర్వహించిన విజయోత్సవ ట్రాక్టర్ల ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. టీడీపీ మండల నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, పి.రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆమె రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కర్రోతు నర్సింగరావు, డైరక్టర్లు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలపై అండగా ఉంటుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ముంజేరు గ్రామానికి చెందిన నల్ల తాతయ్య అనే వ్యక్తికి మంజూరైన రూ.45,700 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె మంగళవారం పంపిణీ చేశారు. పార్టీ నాయకులు వందనాల రమణ, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల ధ్వంసం

భోగాపురం(పూసపాటిరేగ), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సిరంగ దొర ఆధ్వర్యంలో మంగళవారం మద్యం సీసాలు ధ్వంసం చేశారు. ఆరు కేసుల్లో పట్టుబడిన 169 మద్యం సీసాలను ధ్వంసం చేశారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి

సంతకవిటి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండవకురిటి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై మంగళవారం దాడి చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి, నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఈ దాడిలో 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 13న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నామని చెప్పారు. దీంతో కంచరాం, ఆగూరు, అమరాం, దోసరి, గడిముడిదాం, దోసరి, వస్త్రపురికాలనీ, ఒమ్మితో పాటు రాజాం పట్టణంలోని బొబ్బిలి రోడ్, చీపురుపల్లి రోడ్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం



కల్వర్టు పనులు చేపడుతున్న దృశ్యం

రాజాం రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజాం-పెనుబాక మార్గంలో కల్వర్టు పనులు మంగళవారం ప్రారంభించారు. ఈ మార్గంలో ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారిందన్న విషయాన్ని ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో 'ఆదమరిస్తే అంతే..' శీర్షికన ప్రచురితమైన వార్తకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పందించారు. తక్షణమే అక్కడ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో రూ.4.50 లక్షల అంచనా వ్యయంతో మంగళవారం కల్వర్టు పనులు ప్రారంభించారు.

దాసరి సంక్షేమ సంఘ రాష్ట్ర ఛైర్మన్‌గా పొట్నూరు

శృంగవరపుకోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం వీరభద్రపురం పంచాయతీ శివారు మునగపాకవానిపాలెంకు చెందిన పొట్నూరు వెంకట రత్నాజీని రాష్ట్ర దాసరి సంక్షేమ అభివృద్ధి సంఘ బోర్డు ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ప్రభుత్వ మంగళవారం ప్రకటించిన 31 నామినేటెడ్ పదవుల్లో ఈయనకు అవకాశం దక్కింది. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తకు మంత్రి పరామర్శ

దత్తిరాజేరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాజులరామచంద్రాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తుమురోతు కృష్ణను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. కృష్ణకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రి.. కృష్ణను తన స్వగ్రామం రాజుల రామచంద్రపురంలో కలిసి, పరామర్శించారు.

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి అందుకు తగిన ప్రణాళికలను రూపొందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా స్వర్ణాంధ్ర విజన్ 2029, స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారించాలన్నారు. అందులో భాగంగా పాడి రైతుల ఆదాయం పెంచేందుకు సమగ్ర ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలన్నారు. అవసరమైన రైతులకు వ్యవసాయ విద్యుత్ కనక్షన్లు అందజేసి రెండో పంట సాగు పెంచే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గాన్ని పర్యాటకరంగంగా అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి మండలంలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి అందుకు అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో భూ సర్వేతో తలెత్తిన వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారుల కు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది సకాలంలో స్పందించకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు, స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ప్రత్యేక అధికారి ప్రమీలాగాంధీ, గజపతి నగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మా భూములు తీసుకుంటే ఎక్కడకు పోవాలి

● హెచ్‌పీసీఎల్ అధికారులను నిలదీసిన వివిధ గ్రామాల రైతులు

కొత్తవలస, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో తమ భూములను తీసేసుకుంటే తాము ఎక్కడకు పోవాలని మండలంలోని సంతపాలెం, దెందేరు, గులివిందాడ, చీపురువలస, చీడివలస, సుందరయ్యపేట, గొల్లలపాలెం, వియ్యంపేట, దేవాడ, నరపాం, వీరభద్రపురం గ్రామాల రైతులు హెచ్‌పీసీఎల్ అధికారులను నిలదీశారు. మండలంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్‌కు సంబంధించి భూసేకరణకు నిర్వహిస్తున్న సర్వే పనులపై ఈ గ్రామాలకు చెందిన రైతులు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌పీసీఎల్ పైప్‌లైన్ కోసం తమ భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని రైతులు తేల్చి చెప్పారు. ఇప్పటికే పోలవరం కాలువ నిర్మాణానికి, ఐవోసీ పైప్‌లైన్ కోసం, గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసమని, విశాఖ నుంచి అరుకు వరకు వేస్తున్న 516బీ హైవే కోసమని భూములను సేకరించుకుంటూ పోతే తమకు ఏం భూములు ఉంటాయని రైతులు అధికారులను నిలదీశారు. సేకరించిన భూములకు సరైన ధర ప్రకారం నష్ట పరిహారం ఇవ్వడం లేదన్నారు. పైప్‌లైన్ల కోసం సేకరిస్తున్న భూములకు మరీ దారుణంగా నష్టపరిహారం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. హైవే పక్క నుంచి పైపులైన్ వేసుకుంటే ఎవరికీ నష్టం ఉండదని రైతులు ప్రతిపాదన చేయగా, అందుకు అధికారులు తిరస్కరించారు.



అధికారులను నిలదీస్తున్న రైతులు

113 గ్రామాల్లో భూసేకరణ

హెచ్‌పీసీఎల్‌కు చెందిన చీఫ్ ఇంజనీర్ జి.కిషోర్ మాట్లాడుతూ ఈ పైప్‌లైన్ మూడు రాష్ట్రాల మీదుగా రాష్ట్రంలోని నాలుగు జిల్లాలకు సంబంధించి 30 మండలాలోని 113 గ్రామాలలో భూసేకరణ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 164 కిలో మీటర్ల మేర ఈ పైప్‌లైన్ ఉంటుందన్నారు. ప్రోజెక్టు కోసం 12 మీటర్లు వెడల్పు గల భూమిని సేకరిస్తామని చెప్పారు. ఏడున్నర అడుగుల లోతులో 14 ఇంచీల వెడల్పుతో స్టీల్ పైప్ వేస్తారని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకోకుండా రైతులు సహకరించాలని కోరారు. పైప్‌లైన్ వేసిన తర్వాత ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా, పెద్ద పెద్ద వృక్షాలు పెంచకుండా వ్యవసాయాన్ని చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సలహాదారు జి.అప్పలనాయుడు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డేగల అప్పలరాజు పాల్గొన్నారు.

కూటమి నేతల చిత్రపటానికి పాలభిషేకం

రాజాం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో అధిక మార్కులు సాధించిన అభ్యర్థులు కూటమి నేతల చిత్రపటానికి మంగళవారం పాలభిషేకం నిర్వహించారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగానే సజావుగా డీఎస్సీ నిర్వహించి, సకాలంలో ఫలితాలు వెల్లడించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అభ్యర్థులంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ● ఈనెల 11న విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో రాజాంలోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్‌కు చెందిన పలువురు అభ్యర్థులు అధిక మార్కులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో కె.నిరోష 89.55 మార్కులు సాధించారు. బయాలజీ విభాగంలో జి.రాంబాబు 88.57 మార్కులు సాధించారు. ఎస్జీటీ విభాగంలో కె.జ్యోతి 93.96, డి.శిరీష 92.39, కె.స్వప్న 91.95, కె.స్వాతి 91.38, ఏవీ ప్రకాశ్ 91.21, వై.భాగ్యలక్ష్మి 90.73, సీహెచ్.సత్యవతి 90.52, డి.శ్రావణి 90.21 మార్కులు సాధించారు. వీరిని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శ్రీదేవి అభినందించారు.

సముద్రపు ఉత్పత్తుల ప్రాసెస్‌పై టాస్క్‌ఫోర్స్ కమిటీ

● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): సముద్రపు ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్స్ వద్ద హేచరీలలో, కోల్డ్ స్టోరేజ్‌లలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి, బాల కార్మికుల నిరోధానికి జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ నియమించినట్టు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ చైర్మన్ గాను, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నోడల్ అధికారిగాను, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజరు, మత్స్య శాఖ డీడీ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈలు సభ్యులుగా ఈ కమిటీ నియమించామని ఆయన వివరించారు. కమిటీ సభ్యులు ఒకే రోజున జిల్లాలోనున్న 13 హేచరీలను తనిఖీ చేసి, నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్, పీసీబీ ఈఈ సరిత, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజరు కరుణాకర్, మత్స్య శాఖ డీడీ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

నిర్దిష్ట కాలపరిమితిలో అభియోగ పత్రాలు జారీ చేయాలి

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసు అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో న్యాయ స్థానాల్లో అభియోగపత్రాలు దాఖలు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆయన మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్రిమినల్ కేసులు దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నూతన చట్టాలకు అనుగుణంగా నిర్దిష్ట కాలపరిమితిలో నిందితులపై సంబంధిత న్యాయస్థానాల్లో అభియోగపత్రాలను దాఖలు చేయాలని ఆదేశించారు. దర్యాప్తులో వున్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఈ సాక్ష్య యాప్‌లోనూ, సీసీటీఎన్ఎస్‌లోనూ అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. న్యాయస్థానాల్లో ప్రాసిక్యూషన్ పూర్తి చేసేందుకు ఈ సమన్‌లను త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్య రెడ్డి, రాఘవులు పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఖైదీలపై వివక్ష చూపొద్దు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కృష్ణప్రసాద్

విజయనగరం క్రైం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): విజయనగరం సబ్‌జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీల పట్ల సిబ్బంది, తోటి ఖైదీలు కానీ ఎటువంటి వివక్ష చూపించరాదన్నారు. ప్రతిఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని సూచించారు. సకాలంలో న్యాయసహాయం అందించడానికి జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

లిక్కర్ స్కాంను మించి జిందాల్‌స్కాం

ఎస్.కోట రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రాన్ని కుదిపేస్తున్న గత ప్రభుత్వ లిక్కర్ స్కాం కంటే పెద్దది ఎస్.కోట మండలంలోని జిందాల్ స్కాం అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం బొడ్డవర గ్రామంలో ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి సూచనలతో తమ ప్రాంతానికి జిందాల్ పరిశ్రమ వస్తే అభివృద్ధి చెందుతుందని హరిజన, గిరిజన కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్న ఆశతో 1,166 ఎకరాలు ఇప్పించామన్నారు. అయితే 2006లో మండలంలోని బొడ్డవర, ముషిడిపల్లి, కిల్తంపాలెం పరిధిలో భూములు ఇచ్చామని ఇదే సమయంలో బొడ్డవర, ముషిడిపల్లి పంచాయతీలకు సంబంధించి సర్వే నెంబర్లతో సహా భూములు పంచాయతీ తీర్మానాలతో ఇచ్చామన్నారు. ముసిడిపల్లి పంచాయతీలో పంచాయతీ తీర్మానం చేసిన భూములు కాకుండా తీర్మానం చేయని రోడ్డుపక్క భూములను జిందాల్ కంపెనీ ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకుందని, అప్పట్లో ఇచ్చిన చాలా భూములను తీసుకోలేదన్నారు. దీంతో పాటు కిల్తంపాలెం పంచాయతీకి సంబంధించి తీర్మానాల ప్రకారం భూసేకరణ చేయకుండా నచ్చిన చోట భూములు తీసుకున్నారని.. ఈ రికార్డులు, తీర్మానాలు అడిగితే అధికారుల వద్ద లేవని సమాధానం వస్తుందన్నారు. జిందాల్ భూసేకరణ అంతా తప్పులు తడక అని, దీనిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



నిరసన చేస్తున్న ఆదివాసీలు

ఆదివాసీల పొట్ట కొట్టొద్దు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో జిందాల్ భూ మయాతో దెప్పురు గ్రామాన్ని మాయం చేయొద్దని, ఆ గిరిజన కుటుంబాల్లో ఆవేదన నింపొద్దని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ అన్నారు. బొడ్డవర గ్రామం వద్ద మంగళవారం నిర్వాసితులతో కలిసి దెప్పురు, బందవలస ఆదివాసీ గిరిజనులకు అన్యాయం చేయొద్దని కోరారు. గతంలో వారికి కోర్టు ద్వారా ఇక్కడ భూములు దున్నుకోవడానికి అనుమతులు ఉన్నాయని, ఈ తరుణంలో జిందాల్ కంపెనీ ఈ భూములు, ఈ గ్రామం తమదని ఆదివాసీలను భయపెట్టడం సరికాదన్నారు. జిందాల్ వద్ద ఆధారాలు ఉంటే నాటి పంచాయతీ తీర్మానాలు చూపించాలని డిమాండ్ చేశారు.

దేశ భక్తి చాటేలా..

● 'హర్‌ఘర్ తిరంగా'లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు

దేశ భక్తిని చాటిచెప్పేలా జిల్లా వ్యాప్తంగా జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యాలీలో వివిధ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే పలు కార్యాలయాల వద్ద జాతీయ జెండా రంగులు కలిగిన వస్తువులు, ఆహార పదార్థాలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



రేగిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయం వద్ద..



ఎస్.కోట రూరల్: జామిలో ర్యాలీ



రాజాం: ఎంపీడీవో కార్యాలయం వద్ద..



మెరకముడిదాంలో స్టాల్ ఏర్పాటు చేసిన దృశ్యం



లక్కవరపుకోట: రేగలో ర్యాలీ



భోగాపురంలో..



నెల్లిమర్ల: స్టాల్‌ను పరిశీలిస్తున్న నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ సరోజిని

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

విజయనగరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక సచివాలయ ఉద్యోగి మృతిచెందిన ఘటన మంగళవారం విజయనగరం గౌడవీధిలో చోటుచేసుకుంది. గౌడవీధికి చెందిన ఎం.అవినాస్(32) మెరకముడిదాం మండలం ఊటపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అప్పుల బాధ తాళ లేక మంగళవారం తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

తెర్లాం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించిన కేసులో ఓ యువకుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. గొలుగువలస గ్రామానికి చెందిన సిరివరపు వెంకటరమణ(30) గత కొద్ది ఏళ్లుగా ఓ యువతిని ప్రేమించాడు. ప్రస్తుతం పెళ్లి చేసుకోనని పేర్కొనడంతో ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు దర్యాప్తు చేశారు.

దొంగతనం కేసులో నిందితుడికి రిమాండ్

పాచిపెంట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలో దొంగతనానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన యజ్జల గౌరీష్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ వెంకటసురేష్ తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీ రాత్రి 11 గంటల సమయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలో అమర్చిన కెమెరాలను దొంగలించడంతో పాటు ఏటీఎం మిషన్‌ను కొద్దిగా ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ విషయంపై బ్యాంక్ జాయింట్ మేనేజర్ ఎల్.దేవి గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ నెల 11న దొంగతనానికి పాల్పడిన గౌరీష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు. దొంగతనం కోసం ఉపయోగించిన పరికరాలతో పాటు దొంగలించిన కెమెరాలను రికవరీ చేశామని తెలిపారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గజపతినగరం, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తరలింపుపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'నది.. వారికి నిధి' కథనంపై అధికారులు స్పందించారు. మండలంలోని ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా ఇసుకను తరలించి కల్లాల్లో నిల్వ చేస్తున్నట్టు తహసీల్దార్ బి.రత్నకుమార్ తెలుసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు ఆర్ఐ అప్పలరాజు, వీఆర్వోలు దాడులు జరిపారు. కొత్త శ్రీరంగరాజపురం గ్రామం వద్ద ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. గ్రామానికి చెందిన యిజ్జిరోతు సత్యం అప్పలనాయుడుకు చెందిన రెండు ట్రాక్టర్లు, యిజ్జిరోతు శంకరావుకు చెందిన రెండు, అప్పలనాయుడుకు చెందిన ఒకటి, యిజ్జిరోతు చిన్నంనాయుడుకు చెందిన ఒక ట్రాక్టరు పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లకు రూ.10వేలు చొప్పున అపరాధ రుసుం విధించినట్టు తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ అధికారులు కె.సాముల్, వెంకన్న, శ్రీరాములు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎస్.కోట రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు మలుపు వద్ద మంగళవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. ఎస్.కోట పట్టణం నుంచి కౌముది పాఠశాల బస్సు పిల్లలతో కొత్తూరు వైపు వెళ్తోంది. కొత్తూరు మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా విశాఖపట్నం నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో బస్సు ముందు భాగం, కారు ముందు భాగం దెబ్బతిన్నాయి. అయితే బస్సులో ఉన్న పిల్లలకు ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పెళ్లి కుమార్తె అదృశ్యం

కొత్తవలస, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో పెళ్లి.. ఇంతలో పెళ్లికూతురు అదృశ్యం.. ఈ ఘటన మండలంలోని ఓ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పెళ్లికూతురు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేశారు. తన కూతురుకు మేనమామతో వివాహం నిశ్చయం చేశామని, పెళ్లి పనులు కూడా ప్రారంభించామని, ఇంతలో మంగళవారం తెల్లవారుజామున నుంచి కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

లక్కవరపుకోట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎల్.కోటలో అక్రమంగా తరలిస్తున్న 450 కిలోల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం ఉదయం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వసంత గ్రామానికి చెందిన గూనూరు కాశీ తన వాహనంలో 13 బస్తాల బియ్యాన్ని కొట్యాడ తలారి మార్గంలో తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి, పట్టుకున్నారు. కొట్యాడ బుజ్జి తన షాపు వద్ద అన్‌లోడ్ చేయమన్నాడని నిందితుడు తెలిపినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ బియ్యాన్ని డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్ సమక్షంలో అప్పజెప్పి, నిందితుడిని అదుపులోకి తీసుకుని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

గజపతినగరం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మహిళకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటోడ్రైవర్లకు తీరని నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వమే తమ సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులకు గురి కావల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ రూ.10లక్షలు అందజేయాలన్నారు. మోటారు ఆటో డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన పింఛన్ అందజేయడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ శోభకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి పురం అప్పారావు, రాము, సూర్యారావు పాల్గొన్నారు.

మారేడుబాకలో ఘర్షణ

రాజాం రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఖాళీ స్థలం తమదంటే తమదంటూ కొన్నాళ్లుగా సాగుతున్న వ్యవహారం చిలికి చిలికి గాలివానగా మారి ఘర్షణకు దారితీసింది. దీంతో నలుగురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని మారేడుబాకలో చోటుచేసుకుంది. క్షతగాత్రులను స్థానికులు మంగళవారం రాత్రి రాజాం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. రాజాం ఎస్ఐ శేఖర్ క్షతగాత్రుల నుంచి సమాచారం సేకరించారు.

గాంధీపార్కు అభివృద్ధికి మరిన్ని నిధులు

(ఐదో పేజీ తరువాయి)

మరిన్ని సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయన్నారు. అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా పేరుతో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు నిర్వహించిన కార్యక్రమం ప్రశంసనీయమన్నారు. గాంధీ పార్కునకు సంబంధించి నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించామన్నారు. ప్రముఖ వైద్యుడు డాక్టరు జేసీ నాయుడు మాట్లాడుతూ, సమస్యలను ఎత్తిచూపడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని అభినందించారు. 43వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సత్యవతి మాట్లాడుతూ, గాంధీ పార్కు అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ, నగరపాలకసంస్థ, కలెక్టరు అంబేడ్కర్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు సహకరించడం ప్రశంసనీయమన్నారు. వీఎంఆర్‌డీఏ రూ.35 లక్షల 85 వేలు కేటాయించడం హర్షణీయమన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు సోమశంకరరావు మాట్లాడుతూ, ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థలు నిరంతరం ప్రజల పక్షానే ఉంటాయన్నారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపడమే కాకుండా అవి పరిష్కారం అయ్యే వరకు కృషిచేస్తున్నాయన్నారు. కేవలం వార్తలకే పరిమితంకాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు.

స్పందించిన వీఎంఆర్‌డీఏ..

గాంధీపార్కు అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ (విశాఖ మెట్రో పాలిటిన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ)తాజాగా రూ.35లక్షల 85 వేలు కేటాయించింది. ఇటీవల ఆ పనులకు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్యలు శంకుస్థాపన చేశారు. 'అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం ద్వారా జన వరిలో గాంధీ పార్కులో ఉన్న సమస్యలను, స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు, నేతల దృష్టికి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి తీసుకువెళ్లిన విషయం తెలిసిందే. దీనికి స్పందనగా వీఎంఆర్‌డీఏ నిధులు విడుదల చేసింది.

డోలీ మోతలు తప్పేనా?

(ఐదో పేజీ తరువాయి)

ఆవాసాలకు 315.54 కిలోమీటర్ల పరిధిలో రోడ్ల నిర్మాణానికి రూ.280.53 కోట్లను పీఎం జన్‌మాన్ పథకం కింద నిధులు విడుదల చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 19 గిరిజన ఆవాసాలకు 50.37 కిలోమీటర్ల పొడవున రహదారుల నిర్మాణానికి రూ.52.03 కోట్లు అందించారు. అయితే పది నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ రోడ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. కొన్నిచోట్ల పనులు చేపట్టి సగంలో ఆపేస్తున్నారు. అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

● గిరిశిఖర గ్రామాలన్నీ అటవీశాఖ భూభాగంలో ఉన్నాయి. రెవెన్యూ భూ భాగం కంటే అటవీ భూభాగం ఎక్కువ. దీంతో రోడ్ల నిర్మాణానికి ఈ శాఖ అనుమతులు తప్పనిసరి. ప్రజా అవసరాలకు అనుమతులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఈ శాఖ తన పరిధిని దాటి తప్పుకొనేందుకు చూస్తోంది. ఇదే అదనుగా రోడ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించే అధికారులు అటవీశాఖ అభ్యంతరాల సాకును చూపించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అటవీ శాఖ వద్ద తీసుకున్న భూమికి బదులుగా ప్రభుత్వం వేరే చోట రెవెన్యూతో భూమిని ఇప్పిస్తుంది. అయినప్పటికీ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అభ్యంతరాలు చెబుతోంది. ఎస్.కోట మండలం దబ్బగుంట, పల్లపు దుంగాడ రోడ్డు ఇందుకు నిదర్శనం. ఈ రోడ్డులో కలుస్తున్న అటవీ శాఖకు చెందిన భూమికి బదులుగా ప్రభుత్వం పెదఖండేపల్లి గ్రామ పరిధిలోని రెవెన్యూ భూమిని అప్పగించింది. అయినప్పటికీ ఈ రోడ్డు పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల రోడ్ల నిర్మాణానికి అత్యంత చొరవ చూపుతున్నప్పటికీ రోడ్డు నిర్మాణాలు పూర్తికావడం లేదు. గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. దీంతో అధికారులు కూడా ఈ రోడ్ల నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తున్నారు. కాగా ఎస్.కోట నియోజకవర్గ గిరిశిఖర గ్రామాలన్నీ అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఆనుకుని ఉన్నాయి. ఈ గ్రామాలకు రోడ్లు వేయాలంటే అత్యధిక అటవీ భూభాగం ఆ జిల్లాకు చెంది ఉంది. అక్కడి అధికారులు దయ చూపితే తప్ప ఈ రోడ్ల పనులు పూర్తిచేయడం కష్టం. ఏం జరుగుతుందో చూడాలి.

దటీజ్ లెఫ్ట్ హ్యాండ్

(ఐదో పేజీ తరువాయి)

కూడా అదే వాటంతో ఆడేవాడిని. బొబ్బిలి రాజా కళాశాలలో 1957 లో లెక్చరర్‌గా చేరిన నాటినుంచి రెండు చేతులతో బోర్డుపై కామర్స్ లెక్కలు రాస్తే విద్యార్థులంతా ఆశ్చర్యపోయేవారు.

ప్రారంభోత్సవాలకు ఆహ్వానిస్తుంటారు

గెంబలి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, బొబ్బిలి

బొబ్బిలి ప్రాంతంలో నూతనంగా ఏవైనా వ్యాపారసంస్థలను నా చేతుల మీదుగా ప్రారంభించేందుకు సంబంధిత యజమానులు ఆహ్వానిస్తుంటారు. ఎడమ చేయితోనే ప్రారంభోత్సవం చేస్తాను. దీనిని ఎవరూ ఆక్షేపించరు. పైగా ఇదో సెంటిమెంట్‌గా ఫీలవుతుంటారు.

ఎడమచేతితోనే శక్తి ఎక్కువ

గండెం భాస్కరరావు, కాంట్రాక్టరు, బొబ్బిలి

కుడి చేతివాటం కలిగినవారికి ఎటువంటి శక్తి ఉంటుందో మా ఎడమచేతివాటం వారికి అంతకన్నా బలం ఉంటుంది. నేను షటిల్‌బ్యాడ్మింటన్ ఎడమచేతితోనే ఆడుతాను. కుడిచేత్తో అసలు ఆడలేను.

ఆలయ భూములు ఆక్రమిస్తే సహించం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జామి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):ఆలయ భూములు ఆక్రమిస్తే సహించబోమని పైడితల్లమ్మ ఆలయ ఈవో శిరీష హెచ్చరించారు. విజయనగరం పైడితల్లమ్మ ఆలయ పరిధిలో ఉన్న భూముల ఆక్రమణపై సోమవారం ఆంధ్రజ్యోతిలో ఆలయ భూములనూ వదలడం లేద శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీంతో ఆ శాఖ ఆదేశాల మేరకు పైడితల్లమ్మ ఆలయ ఈవో శిరీష. జామిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, వెంటనే కూల్చివేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ భూమి భీమసింగి వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిందని, ఆక్రమణకు గురి కావడంతో తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశామని చెప్పారు. స్థానికులు మాట్లాడుతూ ఇంకా చాలా భూములు ఆక్రమణలో ఉన్నాయని, వాటిని తొలగింపజేయాలని కోరారు.

కేసీహెచ్‌వలసలో కార్డన్ సెర్చ్

రేగిడి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కొత్తచెలిగానవలస గ్రామంలో రాజాం రూరల్ పోలీస్ సర్కిల్ ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సోదాలు చేశారు. రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు, రేగిడి, సంతకవిటి ఎస్‌ఐలు నీలావతి, గోపాలరావు, సర్కిల్ సిబ్బంది.. మాదక ద్రవ్యాల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరి వద్దయినా నాటు తుపాకులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

విజయనగరం దాసన్నపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోశాధికారి పెద్దపెంకి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు డిమాండ్ చేశారు. కంటోన్మెంట్‌లోని జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో వారు పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలతో అన్ని కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అగ్రకుల భూస్వాముల చేతుల్లో ఉన్న భూములను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బొత్స బుద్ధుడు, శివప్రసాద్, చైతన్యకుమార్, పైడిరాజు, శంకరరావు, ప్రకాష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వేపాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎద వరి సాగులో రైతులు కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని కొత్తవలస వ్యవసాయ శాఖ ఏడీఏ భానులత అన్నారు. మండలంలోని జాకేరు, కరకవలస గ్రామాల్లో ఏవో స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. వరి పంటకు బీమా చేయించుకునేందుకు ఆగస్టు 15 వరకు గడువు ఉందని తెలిపారు. వ్యవసాయశాఖ సిబ్బంది, ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.



రంగరాయపురం శివారులో కాలువపై అడ్డుకట్ట వేసిన దృశ్యం

కాలువలకు చేరక.. పైరుకు నీరందక

● అడ్డుకట్టవేసి మళ్లిస్తున్న వైనం ● ఆందోళన చెందుతున్న శివారు ప్రాంత రైతులు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారాది వద్ద వేగావతి నది నుంచి వచ్చే కాలువల్లోకి పూర్తి స్థాయిలో నీరు చేరకపోవడంతో శివారు ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చిన కొద్దిపాటి నీరు కిందకు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్టవేసి మళ్లిస్తుండడంతో శివారు ఆయకట్టుకు అందని పరిస్థితి నెలకొంది. దీంతో రంగరాయపురం, జె.రంగరాయపురం, పెంట,కొత్తపెంట, భోజరాజపురం, మెట్టవలస, పారాది తదితర గ్రామాలపరిధిలో 800 ఎకరాల్లో సాగులోఉన్న వరిపైరుకు నీరందడంలేదు. దీనికి తోడు ప్రస్తుతం వర్షాలు లేకపోవడం, కాలువల నుంచి నీరందకపోవడంతో పైరు ఎండిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జలవనరులశాఖ అధికారులు కాలువల్లో నీరు మళ్లించకుండా శివారు ఆయకట్టుకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు కాగా నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో పూర్తి స్థాయిలో కాలువల్లోకి రావడం లేదని, అడ్డుకట్ట వేసిన చోట్ల తొలగిస్తున్నామని జలవనరులశాఖ బొబ్బిలి సర్కిల్ ఏఈ హరిబాబు తెలిపారు.



బొబ్బిలి: తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన



బాడంగి: హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



రామభద్రపురం: ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలి

● ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం బొబ్బిలి, రామభద్రపురం, బాడంగిలో ఆజాద్‌కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు.

●బొబ్బిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో బీజేపీ జిల్లా కార్యదర్శి ముగడ అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎస్‌బీఐ సెంటరులో గల అంబేడ్కర్ విగ్రహం నుంచి పాతబస్టాండు, కృష్ణాటాకీస్, ఎన్‌టీఆర్ కూడలి, తాండ్రపాపారాయ జంక్షన్ వరకు వేలాది మంది విద్యార్థులతో ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు సుంకరి సాయిరమేష్, పుల్లెల శ్రీనివాసరావు, నంది హరిప్రకాశ్, ఈశ్వరరావు, గోనా మానస పాల్గొన్నారు.

●బొబ్బిలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల పరిషత్ ఆవరణలో వెలుగు ఏపీఎం పి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, వెలుగుప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

●రామభద్రపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలో మండలపరిషత్ కార్యాలయంనుంచి బైపాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో తిరుమలప్రసాద్, మండల పరిషత్ సీనియర్‌అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాంనాయుడు, ఉద్యోగులు చిట్టూరి శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రత్నకుమారి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

●బాడంగి,ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):బాడంగిలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంపై గ్రామాల్లోని స్వయం సహాయ సంఘాల్లో ఉన్న సభ్యులందరికీ అవగాహన కల్పించాలని వెలుగు ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ కోరారు. కార్యక్రమంలో ఏపీఎం రత్నకుమార్, హేమలత, విజయ్‌కుమార్, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ఎన్ని కేసులు పెట్టినా భూములు వదులుకోం

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట కారేడువలస గిరిజనుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గిరిజనులు

రామభద్రపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి):తాము సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం ఆపే ప్రసక్తిలేదని కారేడువలస గిరిజనులు తెలిపారు. తమపై 107 కేసులు పెట్టినా బెదిరే ప్రసక్తి లేదని, తమకు న్యాయం చేసే వరకు పోరాటం ఆడబోమని తెల్చిచెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా భూములు వదులుకోమని స్పష్టంచేశారు. మంగళవారం రామభద్రపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాము సాగుచేసుకున్న భూములకు ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పేద గిరిజనులపై బైండోవర్ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం అధికారులకు న్యాయమా అని ప్రశ్నించారు. చంటిపిల్లలు, వృద్ధులు, అనారోగ్యం ఉన్న వారిపై కూడా బైండోవర్ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కార్యక్రమంలో మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు, గిరిజన సంఘాల నాయకులు తౌడమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలి

బొబ్బిలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్‌చేశారు. మంగళవారం అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సంఘ నాయకుడు ఒమ్మి రమణ ఉద్యమాల్లో సంఘం పాత్రను వివరించారు. సంఘ మాజీ కార్యదర్శి కోట అప్పన్న మాట్లాడుతూ మార్క్సిజం, లెనినిజం ఊపిరిగా శాస్త్రీయ సోషలిజం గమ్యంగా, సెక్యులరిజం, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఏఐఎస్‌ఎఫ్ పనిచేస్తోందన్నారు.కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సుమన్, శ్రావణ్‌కుమార్, భరత్‌కుమార్, కిరణ్, వాసు, దిలీప్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న రవికుమార్

బొబ్బిలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గోపాలరాయుడుపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం పురస్కరించుకుని పిరిడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రఘువంశి ఆధ్వర్యంలో ఎంపీడీవో రవికుమార్ సమక్షంలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నులిపురుగుల వల్ల జరిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జి.ఉమాదేవి, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా స్వామిత్ర సర్వే చేయండి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):తప్పుల్లేకుండా స్వామిత్ర సర్వే చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మంగళవారం మండలంలోని గోపాలరాయుడుపేట సచివాలయంలోహాజరుపట్టిక, రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీస్థలాలను అనుభవిస్తున్న వారికి హక్కులు కల్పించి, పూర్తి స్థాయి అనుభవదారులుగా గుర్తించేందుకు ప్రభుత్వం స్వామిత్ర పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. సచివాలయ పరిధిలో ఈ సర్వేపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉమాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంపు సెట్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అలజంగి రైతులు

బొబ్బిలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ సదుపాయం కల్పించాలని అలజంగిరైతులు కోరారు.ఈమేరకు మంగళవారం తహసీల్దార్ ఎం.శ్రీనుకు రైతుసంఘం నాయకుడు బి.వెంకటరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ గ్రామంలో 200 వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయని, ఇటీవల ఇద్దరు వ్యక్తుల మధ్య కుటుంబ కలహాల వల్ల వాల్టా చట్టం ప్రకారం ఫిర్యాదుచేయగా విద్యుత్‌సిబ్బంది వ్యవసాయ విద్యుత్‌సరఫరా నిలిపివేశారని తెలిపారు. దీంతో మిగతా రైతులు విద్యుత్ సదుపాయం లేక వ్యవసాయానికి పంపు సెట్ల ద్వారా నీరు పొలాలకు అందించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి సాయం

బొబ్బిలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ కోటిపల్లి అప్పారావు కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. ముత్తావలసకు చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అప్పారావు ఇటీవల విధులు నిర్వర్తిస్తుండగా మృతిచెందాడు దీంతో మంగళవారం ఆయన కుటుంబాన్ని ఎంపీడీవో రవికుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున విడుదలైన పది వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లా భాస్కరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

విజయనగరం దాస్నపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆదానీ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించడానికి వస్తే, అడ్డుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు రెడ్డి నారాయణరావు పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మపురిలో స్మార్ట్ మీటర్లు వద్దు, పాత మీటర్లు ముద్దు అంటూ నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలకు కరెంటు బిల్లుతో ముడిపెట్టడం వల్ల ఇప్పటికే 50శాతం మంది అనర్హులుగా ప్రకటించబడుతున్నారన్నారు. ఆదానీ స్మార్ట్ మీటర్లు వస్తే, వేలల్లో బిల్లులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మారావు, నందీశ్వరరావు, శంకర్, మహిళలు పాల్గొన్నారు.

కాలువలపై ఆక్రమణల తొలగింపు

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో కాలువపై గల ఆక్రమణలను నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం సిబ్బంది మంగళవారం తొలగించారు. నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో ప్రధాన కాలువ మరమ్మతులు దాదాపు పూర్తికావచ్చునన్నారు. అయితే రహదారులు ఆక్రమించి కాలువలపై నిర్మాణాలు చేపట్టడం ఇబ్బందిగా మారుతోందన్నారు. దీంతో పూర్తిగా కాలువలపై అక్రమ నిర్మాణాలను తొలగించామని చెప్పారు.

ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ

బాడంగి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): వాడాడలోని ఆరుగురు రైతులకు మంగళవారం జిల్లా ఉద్యానాధికారి సీహెచ్ చంద్రశేఖర్, ఉద్యానాధికారి పి.మోహన్‌కృష్ణ, వీహెచ్‌ఏ విజయ్‌కుమార్, శివ, ఆయిల్‌ఫామ్ కంపెనీ ప్రతినిధుల సమక్షంలో 1700 ఆయిల్‌ఫామ్ మొక్కలను అందజేశారు. ఈ మొక్కలు ఎనిమిది హెక్టార్లలోనాటారు.

నోటు పుస్తకాల పంపిణీ

బాడంగి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): బాడంగి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ, మండలి హెల్పింగ్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం నోటు పుస్తకాలను ఉచితంగా అందజేశారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులందరికీ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీసీఈవో ఎల్.శాంతి తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్‌దొర, బాడంగి సర్పంచ్ కండి రమేష్, శ్రీరామ్మూర్తి, ఈశ్వరరావు, పలుపాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి బి.మురళీనాథ్ తెలిపారు. మంగళవారం బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.రవికుమార్,అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, ప్రభుత్వ పథకాలు ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు.పి-4 సర్వే గురించి ఆరాతీశారు. వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ నిర్వహించాలని పేర్కొన్నారు.

రిజర్వేషన్ కోసం వినతి

బొబ్బిలి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని బొబ్బిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి కోరారు.ఈ మేరకు ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో పార్లమెంట్ ప్రాంగణంలో బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు కె. లక్ష్మణ్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులను మంగళవారం కలిసి విన్నవించారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

● రాష్ట్ర ఇమ్యునైజేషన్ అధికారి హరిణీదేవి

భోగాపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత, ఆరోగ్యంపై విద్యార్థుల్లో అవగాహన కలిగించేలా చూడాలని రాష్ట్ర ఇమ్యునైజేషన్ అధికారిణి హరిణీదేవి సూచించారు. పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, హైస్కూల్‌ను ఆమె మంగళవారం సందర్శించారు. రికార్డులను తనిఖీచేశారు. వ్యాధి నిరోధక టీకాలపై వైద్య సిబ్బందితో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం హైస్కూల్‌ను సందర్శించి, విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహనకలిగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాఇమ్యునైజేషన్ అధికారి అచ్యుత్‌కుమారి, డీపీహెచ్‌వో శాంతికుమారి, శ్రవంతి, శ్రీరాం పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న హరిణీదేవి